క్లుప్తంగా

నేడు కోడుమూరులో అభివృద్ధి పనులకు భూమిపూజ

కోడుమూరు: మండల కేంద్రం కోడుమూరులోని గొల్లవీధి, సుందరయ్య నగర్ కాలనీల్లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం భూమి పూజ నిర్వహించడంతో పాటు, ఎల్ఎల్‌సీ సబ్‌డివిజన్ కార్యాలయ ఆవరణంలో వైకేపీ ఆధ్వర్యంలో మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్‌ల పంపిణీ నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా కుడా చైర్మన్ కోట్ల హర్షవర్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ హాజరవుతారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు గురువారం 159 క్యూసెక్కులు విడుదల చేసినట్లు డ్యామ్ అధి కారులు తెలిపారు. డ్యామ్‌లో 0.272 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడు, కె.నాగలాపురం, బూడిదపాడులో గురువారం క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను టీబీ సూపర్‌వైజర్ నాగ మహేంద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యేక వాహనంలో రోగులకు ఎక్స్‌రే, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామన్నారు. అదేవిధంగా రోగులకు మందులు, పౌష్టికాహార కిట్లను అందించామని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

కల్లూరు: కల్లూరు అర్బన్ 36వ వార్డు డ్రైవర్స్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. వేసవి కాలం ప్రారంభం కాక ముందే కార్పొరేషన్ పరిధిలో తాగునీటికి కటకట ఏర్పడిందని, ప్రజలు ట్రాక్టర్‌లో వచ్చే ట్యాంకర్ల వద్ద నీటి కోసం కుస్తీ పడుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించకుంటే కార్పొరేషన్ ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రభాకర్, కుమార్ పాల్గొన్నారు.

18న సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 18వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి సబ్ జూనియర్, జూనియర్స్ బాలబాలికలకు సెపక్‌తక్రా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సెపక్‌తక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు గురువారం ఒకప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు వయో పరిమితి సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్‌పోర్టుసైజ్ ఫొటోతో హాజరుకావాలని పేర్కొన్నారు. సబ్ జూనియర్ క్రీడాకారులు 1 జనవరి 2009 తరువాత, జూనియర్ క్రీడాకారులు జనవరి 2004 తరువాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈ నెల 24 నుంచి 25వ తేదీ వరకు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలో నిర్వహించనున్న సబ్ జూనియర్, జూనియర్ రాష్ట్రస్థాయి బాలబాలికల సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. వివరాలకు 94402 57242 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డ్రైవర్‌కు అవార్డు



డ్రైవర్ రాయుడుకు చెక్కు అందిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: ఆర్టీసీలో 29 ఏళ్లు డ్రైవర్‌గా పని చేస్తూ ఒక్క యాక్సిడెంట్ కూడా చేయని ఎమ్మిగనూరు డిపో డ్రైవర్ ఎస్.రాయుడు జిల్లాలో రెండవ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఏపీఎస్‌ఆర్టీసీ డీపీటీఓ శ్రీనివాసులు నుంచి ఆయన అవార్డు పొందారు.దీంతో గురువారం స్థానిక డిపోలో ఆయనకు డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పంపయ్య ప్రోత్సాహక చెక్కు అందజేశారు. డిపో మేనేజర్ అమర్నాథ్‌తో పాటు నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ డిపో కార్యదర్శి ముస్తక్ అహమ్మద్ అభినందించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని సున్నంబట్టి వీధిలో నిర్మిస్తున్న ఇంటిపైకి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో రోషన్ అనే యువకుడు గురువారం మృతి చెందాడు. మద్యం మత్తులో నిర్మిస్తున్న ఇంటిపైకి వెళ్లిన ప్రమాదవశాత్తు కాలుజారి విద్యుత్ తీగలపై పడటంతో షాక్‌తో కింద పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అయితే మృతుడి మెడపై గాయం ఉండటంతో ఆత్మహత్యనా, లేక హత్యనా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పంచలోహ సూర్య రథం విరాళం

మద్దికెర: మండలంలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ రంగనాథస్వామి దేవాలయానికి రూ.3 లక్షల విలువజేసే పంచలోహ రథాన్ని రామలింగారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి విరాళంగా అందజేశానపి ఈఓ చంద్రశేఖరరెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరి గౌడ్ గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ రథసప్తమిని పురస్కరించుకొని స్వామి వారిని ఊరేగించేందుకు సూర్యరథ ప్రభను అందజేయడం సంతోషకరమన్నారు. దాతల కుటుంబ సభ్యులు, సర్పంచ్ కారుమంచి మల్లికార్జున, మాజీ సర్పంచ్ సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్లు.. సంక్షేమ వారధులు

- ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే చేరవేత
- అందరి మన్ననలు పొందుతున్న వలంటీర్లు
- అవార్డులతో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం, నగదు ప్రోత్సాహం భారీగా పెంపు
- గతంలో మాదిరిగా కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేదు
- వలంటీర్ వ్యవస్థపై సర్వత్రా హర్షం



హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీదేవమ్మకు పింఛన్ అందిస్తున్న వెంకటసుబ్బుడు (ఫైల్)



తిరుపాడులో బాలేశ్వరమ్మకు ఐరిష్ ద్వారా పింఛన్ అందిస్తున్న వలంటీర్ శ్రీనివాసులు (ఫైల్)

గడివేముల: గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయం పరిధిలో ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ అత్యున్నత సేవలతో ప్రజల మన్ననలు పొందుతోంది. రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంక్షేమ వారధులుగా ఏర్పాటు చేసిన వలంటీరు వ్యవస్థ నాలుగో ఏడాది పూర్తి చేసుకుని ఐదో ఏడాదిలో ప్రవేశించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019 ఆగస్టు 15వ తేదీన వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో 228 మంది వలంటీర్లు ప్రజలకు సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో వృద్ధులు, వితంతువులు, అయా కేటగిరీలకు చెందిన లబ్ధిదారులు పింఛన్ సొమ్ము తీసుకునేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అందుకు భిన్నంగా వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీంతో ప్రతి నెల ఒకటో తేదీన తెల్లవారకముందే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్లను పలువురు అభినందిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుని ఇంటి వద్దకే అందిస్తున్న ఘనత వలంటీర్లకే దక్కుతుంది. తమ పరిధిలో ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లను ఎంపిక చేసి వారిని ప్రోత్సహించేలా ప్రభుత్వం ఏటా వారికి సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర వంటి పురస్కారాలు అందిస్తోంది. గురువారం గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో వలంటీర్ల సేవలకు గుర్తుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లకు అందించే ప్రోత్సాహకాలను భారీగా పెంచడంతో వలంటీర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సేవా వజ్రకు రూ.30 వేల నుంచి 45 వేలు, సేవా రత్నకు రూ.20 వేల నుంచి 30 వేలు, సేవా మిత్రకు రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారు.

సకాలంలో పింఛన్

గ్రామ వలంటీర్లకు కేటాయించిన 50 కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుక ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారక ముందే పంపిణీ చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పింఛన్‌దారులు కార్యాలయాల వద్ద చాలా ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ పాలనలో కొందరు వలంటీర్లు లబ్ధిదారుల ఇబ్బందులను తెలుసుకుని వారు ఎక్కడుంటే అక్కడికి వెళ్లి పింఛన్ అందిస్తున్నారు. మరికొందరు ఇతర రాష్ట్రాలకు వెళ్లి బయోమెట్రిక్ నమోదు చేసి మరీ పింఛన్ సొమ్మును అందించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుస్తున్నారు. అదేవిధంగా ప్రతి సంక్షేమ పథకానికి అర్హులైన వారిని గుర్తించడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు.

పారదర్శకంగా ఎంపిక

వలంటీర్లకు ఇచ్చే పురస్కారాల ఎంపిక పారదర్శకంగా జరిగింది. ఎక్కడా ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా సాంకేతికంగానే రాష్ట్రస్థాయిలో టెక్నికల్ పద్ధతిలో ఎంపిక చేశారు. వలంటీర్ల పని తీరు ఆధారంగా నిర్దిష్ట సమయంలో ప్రజలకు చేసే సేవలను గుర్తించి పురస్కారాలకు అర్హులుగా నిర్ణయించారు. వలంటీర్ల సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం మూడు రకాల అవార్డులను అందిస్తుంది. 95–100 శాతం పనితీరు కనబరిచిన వారికి సేవావజ్ర, 80–95 శాతం సాధించిన వారికి సేవారత్న, 60 శాతం పైగా సాధించిన వారికి సేవా మిత్ర అవార్డులను అందజేయనున్నారు. అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి చేతుల మీదుగా వలంటీర్లకు అవార్డులు అందించనున్నారు.

ఎంతో సంతృప్తినిస్తోంది



గ్రామంలోనే ఉంటూ ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నాను. నాకు కేటాయించిన కుటుంబాలకు ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని సకాలంలో అందించడం ఎంతో సంతృప్తినిస్తోంది. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ఆ సంక్షేమ పథకం గురించి వివరించడంతో పాటు అందుకు దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించడం. అవసరమైన ధ్రువపత్రాలను సకాలంలో ఇప్పించడం వల్ల ఆ కుటుంబాల నుంచి లభిస్తున్న ఆదరణ ఎంతో సంతృప్తినిస్తోంది.

– గరిటగారి పెద్దరాజు, గ్రామ వలంటీర్, గడివేముల గ్రామం

సంతోషంగా ఉంది



నా పరిధిలో ఉన్న కుటుంబాలకు వారి ఇంటి సభ్యురాలిగా సేవలు అందించడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం ఏటా బాగా పనిచేసిన వలంటీర్లను గుర్తించి ప్రోత్సాహకాలు అందించడంతో మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు ఉపయోగపడుతుంది. ప్రతి నెలా తెల్లవారుజామునే పింఛన్లు అందించడంతో లబ్ధిదారులు ఎంతో సంతోషపడేవారు. నాకు కేటాయించిన ఇళ్లకు కులమతాలకు, పార్టీలకు అతీతంగా సేవలందిస్తున్నాను. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వర్తించేలా కృషి చేస్తున్నాను.

– రమాదేవి, గ్రామ వలంటీర్, బూజునూరు గ్రామం.

బంద్‌ను జయప్రదం చేయండి

కల్లూరు: ఈ నెల 16న దేశవ్యాప్తంగా చేపట్టనున్న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని దొడ్డిపాడు, పెద్దటేకూరు, చిన్నటేకూరు గ్రామాలలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులు, కార్మికులు, కర్షకులు, పేదలకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకురావడం సరికాదన్నారు. ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని, రైతులకు రూ.రెండు లక్షల వరకు రుణాలు మాఫీ చేయాలన్నారు. కేరళ తరహాలో రుణ విముక్తి చట్టాన్ని తీసుకురావడంతో పాటు నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం నాయకులు పుల్లన్న, సురేంద్ర యాదవ్, మహమ్మద్, బాషా, రామాంజనేయులు, శివ, రాముడు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్టలో బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి ఘనంగా నిర్వహించారు. గురువారం గ్రామంలోని సేవాలాల్ ఆలయంలో గిరిజనులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పూజారాలు సేవాలాల్ గొప్పదనం వివరించారు. పూజారి సోమశేఖర్‌నాయక్, రాముడు నాయక్, కృష్ణానాయక్, రవీంద్రానాయక్, భారతిబాయి పాల్గొన్నారు.

23 నుంచి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 23, 24 తేదీల్లో నంద్యాల పట్టణంలోని డాక్టర్ రామలింగారెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో 52వ రాష్ట్ర స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి, సంఘం అధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు లీగ్–కమ్–నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వచ్చే నెల 16 నుంచి 20వ తేదీ వరకు కేంద్రపాలిత ప్రాంతమైన దాద్రానగర్ హవేలీలో జాతీయస్థాయి మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

జగనన్నను గెలిపించుకునేందుకు సిద్ధమవుదాం



సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, తదితరులు



సన్నాహక సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 18న రాప్తాడులో జరిగే సిద్ధం సభ విజయవంతం చేయడంపై కార్యకర్తలతో సన్నాహక సమావేశం

కల్లూరు: రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో న్యాయం వైపు నిలబడి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు అందరం సిద్ధంగా ఉందామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మెల్యే స్వగృహంలో కల్లూరు అర్బన్, గ్రామీణ, ఓర్వకల్లు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో సిద్ధం సన్నాహక సమావేశం నిర్వహించి, పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 18న అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభలో రాయలసీమ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు/సమన్వయకర్తలు పాల్గొంటారన్నారు.

ప్రజలను మోసం చేసిన టీడీపీ

2014 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 600కు పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలుచేయకుండా ప్రజలను మోసం చేశారని ఎమ్మెల్యే కాటసాని ధ్వజమెత్తారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. జగనన్న పాలనలో మంచి జరిగి ఉంటే ఓటు వేసి అండగా నిలవాలని కోరారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఓట్ల కోసం ప్రభుత్వంపై అసత్యాలు, అబద్ధాలు ప్రచారం చేసి ప్రజలను మభ్య పెట్టాలనుకుంటున్న పార్టీలకు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. డీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు, అన్నమయ్య జిల్లాల వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ గాజుల శ్వేతారెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు, సమన్వయకర్తలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

కర్నూలు (అగ్రికల్చర్): రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రకృతి వ్యవసాయం విస్తరిస్తోందని, ఇందుకు అనుగుణంగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనర్ శేఖర్‌బాబు వ్యవసాయ యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆయన గురువారం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25లో 3.7 శాతం ఎరువుల వినియోగాన్ని తగ్గించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ స్థానంలో పచ్చిరొట్ట ఎరువులు, బయోఫర్టిలైజర్, ఇతర సేంద్రియ ఎరువులను వినియోగించే విధంగా చూడాలని సూచించారు. రైతుల్లోకి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 21న పీఎం కిసాన్ 16వ విడత నిధులు రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదలయ్యే అవకాశం ఉందని, ఆ లోపు పెండింగ్‌లో ఉన్న బ్యాంకు ఖాతాలకు ఈ–కేవైసీ చేయించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు నుంచి జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏలు సాలురెడ్డి, బాలవర్ధిరాజు, సునీత, మహమ్మద్ ఖాద్రి, అగ్రానమీ ఏడీఏ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీధర్

కర్నూలు (న్యూటౌన్): ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీధర్ సూచించారు. రోడ్డు భద్రత 35వ మాసోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక ఆర్టీఏ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ బీఎం నాగార్జున్ రెడ్డి, యూబీఐబీసీ బీఎం రంగనాథ్‌రెడ్డి, ఇన్సూరెన్స్ అధికారులు ఎంఏ హఫీజ్, ఎం రమేష్‌బాబు, సయ్యద్ మాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీటీసీ శ్రీధర్ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, త్రిబుల్ రైడింగ్ చేయకూడదని, తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించి రోడ్డు నియమాలను పాటించాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని డ్రైవర్లకు సూచించారు. ముఖ్యంగా వాహనదారులు, డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. అలా నడుపుతూ పట్టుబడితే 6 నెలలు జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. నాగార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. తప్పనిసరిగా ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, వాహన రికార్డులను అప్‌డేట్‌గా ఉంచుకోవాలన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆర్టీఓ రమేష్, ఏఎంవీఐ బాబుకిశోర్, అజీజ్‌ఖాన్, రాజేష్, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని సెంట్రల్: అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్పీ ఎస్ఐ గోపాల్ హెచ్చరించారు. గురువారం ఉదయం ఆదోనికి చెందిన బోయ కుమార్, బోయశంకర్ రెండు లగేజీ బ్యాగులను తీసుకుని కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ నుంచి దిగి ప్లాట్‌ఫాం–1పై నుంచి వెళ్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేశామన్నారు. బ్యాగుల్లో కర్ణాటక ఒరిజినల్ చాయిస్ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు ఉన్నాయన్నారు. సదరు నిందితులు రాయచూర్‌లో ప్యాకెట్లను తక్కువ రేటుకు కనుగోలు చేసి మార్కెట్లో ఎక్కువ రేటుకు అమ్ముకునేందుకు తీసుకొట్టినట్లు తెలిపారు. మొత్తం ప్యాకెట్ల విలువ రూ.19,200 ఉంటుందన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. తనిఖీలలో ఏపీఆర్పీసీ లియాఖత్, రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ సాయి, రైల్వే కానిస్టేబుల్స్ హుసేన్, అలీ, గాదిలింగ, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తుంబిగనూరు సమీపంలో..

కోసిగి: మండల పరిధిలోని తుంబిగనూరు గ్రామ సమీపంలోని తుంగభద్ర నది ఒడ్డున నుంచి బైక్‌లపై అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుబడినట్లు సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ రమేష్ బాబులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం అందిన సమాచారం మేరకు తుంగభద్ర ఒడ్డున కాపు కాయగా కిలోమీటర్ దూరంలో నిందితులు బైక్‌లు, అక్రమ మద్యం బాక్సులు వదిలేని పరారైనట్లు తెలిపారు. అందులో 10 బాక్స్‌లలో 960 ఒరిజనల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని, బైక్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేశామని, నిందితులను బైక్‌ల ఆధారంగా త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ నాగరాజు, మధు పాల్గొన్నారు.



తుంబిగనూరు వద్ద పట్టుబడిన అక్రమ మద్యం, బైక్‌లతో సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ

ఎస్‌హెచ్‌జీ సభ్యుల సమస్యలు పరిష్కరించాలి



మెప్మా పీడీకి వినతిపత్రం అందిస్తున్న మహిళా నేతలు

కర్నూలు (న్యూటౌన్): స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల సమస్యలను పరిష్కరించాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల, ఎస్‌హెచ్‌జీ సంక్షేమ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్.అలివేలు కోరారు. ఈ మేరకు వారు గురువారం మెప్మా పీడీ నాగశివలీలను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా మహిళలు ఐకమత్యంతో పొదుపు సంఘాలను ఏర్పాటు చేసుకుని బ్యాంకు రుణాలను తీసుకుని సక్రమంగా చెల్లిస్తున్నారన్నారు. ప్రస్తుతం సున్నా వడ్డీ కేవలం రూ.3 లక్షలకు మాత్రమే పరిమితం చేశారని చెప్పారు. తీసుకున్న మొత్తం రుణానికి సున్నా వడ్డీ వర్తింపజేయాలని కోరారు. అనేకమంది సభ్యులు అభయహస్తం పేరుతో డబ్బులు కట్టారని వారికి ఇంత వరకూ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. స్త్రీ నిధి రుణాల్లో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు కేఎస్ పద్మ, రేవతి, నజియాషేకూన్, కృష్ణవేణి, పర్వీన్, రాధ, కవిత తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై శ్రీహరి విహారం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో శ్రీహరి

కర్నూలు కల్చరల్: సంకల్‌బాగ్ హరి హర క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి సహిత శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ 18వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు గురువారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీవారి మూలమూర్తులు, ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకం విశేష అర్చన, లక్ష్మీకుబేర హోమం, సుదర్శన హోమాలు నిర్వహించారు. రాత్రి శ్రీవారిని అశ్వవాహనంపై నగరంలోని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. చతుర్వేద స్వస్తి, భాగవత పురాణం భక్తులను అలరించాయి. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్ శర్మ, కార్యదర్శి హెచ్‌కే రాజశేఖర్‌రావు, గౌరవ సలహాదారు హెచ్‌కే మనోహర్‌రావు, సభ్యులు కేజీ ప్రభాకర్, శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు రూ.3కోట్లు మంజూరు



మంజూరైన నిధులను వివరిస్తున్న ఏఈ గంగరాజు

కోడుమూరు రూరల్: మౌలిక వసతుల కల్పనకు కోడుమూరు మండలానికి గడపగడపకు మన ప్రభుత్వం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.3కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు మండల ఇంజనీర్ గంగరాజు గురువారం తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం నిధులు అనుగొండ గ్రామానికి రూ.20లక్షలు, కల్లపరి రూ.20లక్షలు, కోడుమూరు రూ.కోటి, వర్కూరు రూ.40లక్షలు, ప్యాలకుర్తి రూ.25లక్షలు, ఎర్రదొడ్డి రూ.10లక్షలు, గోరంట్ల రూ.10లక్షలు, వెంకటగిరి రూ.15లక్షల చొప్పున మంజూరయ్యాయన్నారు, అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ముడుమలగుర్తి గ్రామానికి రూ.9లక్షలు, ఎర్రదొడ్డి రూ.9లక్షలు, గోరంట్ల రూ.12లక్షలు, ప్యాలకుర్తి రూ.7లక్షలు, వెంకటగిరి రూ.3లక్షలు, క్రిష్ణాపురం రూ.3లక్షలు, కోడుమూరుకు రూ.17లక్షల చొప్పున మంజూరైనట్లు వివరించారు. మంజూరైన నిధులతో ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఏఈ పేర్కొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



పొదుపు సంఘాలకు మెగా చెక్కును అందజేస్తున్న అధికారులు

కల్లూరు: బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని బీఓబీ జోనల్ హెడ్, జనరల్ మేనేజర్ రితేష్‌కుమార్, తిరుపతి రీజినల్ హెడ్ అమర్నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నటేకూరు బ్రాంచ్ శాఖ నూతన భవనాన్ని వారు ప్రారంభించారు. అనంతరం ఉలిందకొండ, చిన్నటేకూరు ఖతాదారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా హాజరై బ్యాంకు అధికారులతో కలసి పొదుపు సంఘాల మహిళలకు ఫిబ్రవరి మాసంలో లోన్ పొందిన రూ.5 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లోన్ తీసుకున్న వారు సకాలంలో వాయిదాలు చెల్లించాలన్నారు. ఎంపీడీఓ రమణమూర్తి, చిన్నటేకూరు, ఉలిందకొండ బ్రాంచ్ మేనేజర్లు సుదర్శన్, మిథున్‌చక్రవర్తి మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల కల్పనలో నిర్లక్ష్యం వీడండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

సి.బెళగల్: ఉపాధి పనుల కల్పనలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని ఎంపీడీఓ శకుంతల సూచించారు. గురువారం ఆమె స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో కల్పిస్తున్న ఉపాధి పనులపై అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం ప్రతిరోజు 3,600 మంది కూలీలకు పనులను కల్పించాల్సి ఉందని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఓ లక్ష్మన్న మాట్లాడుతూ గ్రామాలలో ఎస్సీ, ఎస్టీ సమాజిక వర్గాల కూలీల కుటుంబాలకు వంద రోజులు పూర్తి చేసేందుకు టీఏలు, ఎఫ్ఏలు, మేటీలు చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులకు వచ్చే వారి వివరాలను, పనులు చేపట్టే అంశాలను ఎప్పటికి అప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఈసీ పృధ్వీరాజ్ సూచించారు.

నేడు రామిరెడ్డి తాత ఆరాధన మహోత్సవం



తుమ్మిళ్ల వెంకట రామిరెడ్డి తాత

కోడుమూరు రూరల్ : కోడుమూరు పట్టణంలో వెలసిన శ్రీసద్గురు రాజయోగివర్యులు తుమ్మిళ్ల వెంకట రామిరెడ్డి తాతర్యుల 37వ ఆరాధన మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు భక్త బృందం సభ్యులు మల్లారెడ్డి తెలిపారు. ఉదయం పంచామృతాభిషేకములు, పూజలు, మంగళహారతి, మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం, శ్రీలక్ష్మీ నారాయణల కల్యాణం ఉంటుందన్నారు. సాయంత్రం నూతనంగా చేయించిన తాతవారి ఉత్సవ విగ్రహాన్ని నూతనం రథంపై ఆశీనులను చేసి బీసీ కాలనీలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయం వరకు అశ్వరథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మల్లారెడ్డి వివరించారు.